


# అందమైన అనుభవం

— బి. శ్రీనివాస్

ఉదయం అయిదింప్పావుకి బస్సు 'వూటీ'లో ఆగగానే — నేనూ, సతీష్ భరద్వాజా, షకిల్ రహమాన్, జోసెఫ్ నల్గురమూ దిగిపోయాము.

బస్సులో కూర్చున్నంత సేపూ అంతగా తెలీలేదుగానీ — దిగగానే చలి మమ్మల్ని వొక్కసారిగా వొణికింపచేసింది.

అసలే చలికాలం. చిక్కని చీకటి. పదడుగుల దూరంలో యెవరున్నారో సరిగ్గా కనిపించని పరిస్థితి.

మేం స్వెటర్స్ వేసుకున్నా లాభం కనిపించలేదు. వులెన్ బ్లాంకెట్స్ తీసి కప్పుకున్నాము.

మాట్లాడినా, నిట్టూర్చినా నోట్లోంచి పొగ దూసుకొస్తుంది — అంత చలి అక్కడ.

అంతలో యెవరో వొక వ్యక్తి మా దగ్గిరకి వచ్చి తమిళంలో అడిగాడు —

"యెనా సార్? హోటల్ రూమ్, వేన్‌మా?"

(యేం సార్? హోటల్ రూమ్ కావాలా?")

"ఆమ. వేను."

(అవును. కావాలి) — చెప్పాను నేను. నాకు తమిళం కొద్దిగా వచ్చు.

"యింగకూడ వాంగో"

(నా వెంట రండి) — అంటూ మాకు దారి చూపిస్తూ ముందుకు కదిలాడతను.

మాకు ఆ చీకట్లో సరిగ్గా కనిపించడం లేదు. లైట్లు కూడా లేవు. నడుస్తుంటే — మా కాళ్ళు తిమ్మిరెక్కిపోతున్నాయ్. శరీరంలోని ప్రతీ రక్తకణమూ 'జివ్వు' మంటూంది.

"యిదేం చలిరా బాబూ! హారిబుల్" — అన్నాడు సతీష్ వొణికిపోతూ.

"నిజమేరా సతీష్. మాట్లాడదామంటే నోట్లోంచి మాట కూడా సరిగ్గా రావడం లేదు. కంఠం వొణికిపోతూంది. ఇంతవరకూ యిలాంటి అనుభవం మన డైరీల్లోనే లేదు. ఇక ఈ అనుభవాన్ని మాత్రం మరచిపోలేము" — అన్నాడు జోసెఫ్.

"హే భాయ్! హమ్ లోగోంకో కహా లేకే జారే తుమ్" — అడిగాడు షకీల్ కూలీని వుద్దేశించి.

"ఆగయా సాబ్, ఔర్ దస్ కదమ్ దాలేతో బస్" చెప్పాడు కూలీ.

అతనికి హిందీ కూడా వస్తుందని అర్థమైంది మాకు.

"యేం ఆగయానో యేమో! ఈ చలికి చచ్చిపోయేట్టున్నాం మనం" — అన్నాడు జోసెఫ్. ఆ చలికి తట్టుకోలేకపోతున్నాడు.

మరో రెండు నిమిషాలకి హోటల్ ముందుకి వచ్చాము.

కూలీ, హోటల్ మేనేజరుకి మమ్మల్ని చూపించి, మా దగ్గిర కూలి డబ్బులు తీసుకొని వెళ్ళిపోయాడు.

మాకు డబుల్ కాట్ ఎలాట్ చేయగానే అందులోకి దూరిపొయ్యాం. కాస్త రిలీఫ్‌గా ఫీలయ్యాం.

మంచంపైకి చేరి టేప్ రికార్డర్ ఆన్ చేశాడు జోసెఫ్. అందులోంచి వెస్టర్న్ మ్యూజిక్ వస్తుంటే — దాని కనుగుణంగా డాన్స్ చేయసా

గారు జోసెఫ్, షకీల్.

అంతలో హోటల్ బోయ్ వచ్చి చెప్పాడు హిందీలో —

"సార్! మీరు స్నానం చేయాలనుకుంటే — బాయిలర్లో వేడి నీళ్ళున్నాయి. బక్కెట్లు కూడా అక్కడే వున్నాయి. ఇటు పక్కనేమో బాత్రూములున్నాయి."

బోయ్ చూపించి వెళ్ళిపోయాక, అన్నాను నేను —

"స్నానం చేద్దామా సతీష్?"

"అమ్మో!! యింత చలిలోనా? నేను చేయలేను."

"వారే శమంత్! నువ్వు షాయర్ (కవి)వి కదా? ఈ చలిలో స్నానం చేస్తుంటే — అద్భుతమైన షాయరీ పుట్టుకొస్తుంది. రేపటి రోజున నువ్వు యే పత్రికయినా 'హేమంతంలో శమంత్' అన్న టైటిల్ పెట్టి పంపించావనుకో, అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. హౌ యూ నహీ?" నవ్వుతూ అన్నాడు షకీల్.

మిగతా ఇద్దరూ నవ్వేశారు.

"వెధవ. నా కవిత్వమంటే — అంత చిన్న చూపా! వుండండి మీ పని చెప్తాను. వొక్కొక్కరికీ వొక్కొక్క కవిత వినిపించేస్తానిప్పుడు. తిక్క కుదురుతుంది" — నవ్వుతూ అన్నాను నేను.

"అయ్యబాబో! నీ పొల్లమిప్పకు కవి మహాశయా! అసలే చలికి వొణికిపోతుంటే — మరింత దడుసుకు నేట్టు చేయకు" — భయం నటిస్తూ అన్నాడు సతీష్.

"వో.కె. మై ఫ్రెండ్.. మిమ్మల్ని వొదిలేస్తున్నాను. నేను మాత్రం స్నానం చేసి వస్తాను" అంటూ మా రూము వెనక్కి వెళ్ళాను.

బాయిలర్ లోంచి వేడినీళ్ళు బక్కెట్లో నింపుకొని స్నానం చేశాను — చలిలో వేడినీళ్ళ స్నానం చేయడమంటే యెంతో యిష్టం నాకు.

స్నానం ముగించాక, అంతకు ముందున్న చలి కాస్త తగ్గినట్టనిపించింది.

అప్పటివరకూ మిగతా ముగ్గురూ




దామ్ చేస్తూనే వున్నారు — మ్యూజిక్కు వస్తూనే వుంది.

నేను డ్రెస్సప్ అయ్యి హోటల్ బయటికి వచ్చి నిల్చున్నాను.

సమయం ఆరు దాటుతూందేమో!

రాత్రి చలిలో అలసిన ప్రకృతి అందంగా నిద్రలేస్తుంది. ఉదయ విహంగం పాడుతూనే వుంది.

హోటలుకి బయట రైల్వేస్టేషను రూపం అస్పష్టంగా కనిపిస్తోంది, ఆ సన్నటి పొగమంచులో.

ఇంకా ఆరిపోని మెర్క్యురీ బల్బు కాంతిలో పచ్చని ఆకుల మధ్యమున్న గులాబీ అందంగా తలవూపుతోంది. పక్కనే హేమంతపు చేమంతులు — వాటిపై నిలిచిన నీహారికా బిందువులు.

రాత్రిలో రహస్యంగా దాగిన అందాలు బహిర్గతమవుతుంటే —

ఇంద్రధనుస్సులోని సప్తవర్ణాలలో అశ్వాలను బిగించిన రథాన్ని అధిరోహించడానికి ఆయత్తమవుతున్నాడు ఆదిత్యుడు. అతనికి స్వాగతగీతం పాడుతూ గులాబీ, చేమంతుల మిశ్రమం గగనతలంలో విరగబూస్తుంటే —

పల్చటి బంగారు రంగు కాంతి నేల పైకి జారుతుంది.

అప్పుడే .... సరిగ్గా అప్పుడే —

యేదో అలికిడి వినిపించింది. అటు తిరిగి చూశాను.

సన్నటి మెరుపుతీగ గుండెల్లోకి జారింది.

వొక్కసారిగా విద్యుత్తు పాకింది.

ఘనీభవించిన నిశ్శబ్దంలో మనోవీణా తంత్రుల్ని శృతి చేస్తున్నట్టు... ప్రకంపనలు ... అలలు అలలుగా, తెరలు తెరలుగా కదిలిస్తున్నాయ్.

శత పత్రేక్షణలా .. చంద్రికలా వుందా అమ్మాయి.

నేను తేరుకునే లోపు ఆమె అక్కడి నుండి కదిలిపోయింది నన్ను చూస్తూ.

నా గుండెల్లో వెన్నెల తుఫాన్ని సృష్టించి, పరిమళపు పొరభాన్ని నింపి వెళ్ళిపోయింది.

ఆమె రూపం క్షణక్షణానికి వొళ్ళు విరుచుకుంటూంది నాలో.

అంతలో సతీష్ వచ్చి అన్నాడు —

"వారేయ్! నీ ప్రకృతి ఆరాధన చాలలేదా యింకా? యిక లాభం లేదు. 'ది యెండ్' — అన్న బోర్డు ఆకాశంలో కనిపించేవరకు కదిలేటట్టు లేవు.'

నవ్వొచ్చింది నాకు.

షకీల్, జోసెఫ్ కూడా బయటికి వచ్చారు — ట్రిమ్‌గా తయారయ్యి వున్నారు.

మా రూమ్‌కి తాళం వేసుకొని బైలుదేరాము.

ఆ అమ్మాయి మళ్ళీ వోసారి కనిపిస్తే బావుండుననుకున్నాను.

మా వెనుక ఆడపిల్లల గొంతులు వినిపించి, చటుక్కున వెనుదిరిగి చూశాను.

దాదాపు పదిమంది అమ్మాయిలు.

అందులో యింతకుముందు కనిపించిన అమ్మాయి కూడా వుంది — తను కూడా నన్ను చూసింది.

వొక్కసారిగా వుత్సాహమొచ్చింది.

వొకరికొకరు మాట్లాడుకుంటూ తుళ్ళి తుళ్ళి నవ్వుతున్నారు. రంగు రంగుల నక్షత్రాలు కదులుతున్నట్లు నడుస్తున్నారు, ప్రపంచంలోని ఆనందమంతా తమ సొమ్మే నన్నట్టు.

"వారేయ్! కలర్సురా!!' — గట్టిగా అరిచాడు షకీల్.

వాడికి ఆడపిల్లల షోకెక్కువ. అలానీ — వోవర్‌గా యెప్పుడూ బిహేవ్ చేయడు.

"కలర్సేగానీ — తొందరపడి మనస్సు మాత్రం పారేసుకోకురా బాబూ!" అన్నాడు జోసెఫ్.

"పారేసుకుంటే మాత్రం తప్పేంటిరా భాయీ!"

"తప్పేం లేదు డియర్. కాని — వాళ్ళు నిన్ను ఆరేసుకుంటారేమోనని భయం"

"అంటే — ముందు నన్ను వుతికేస్తారనే గదా అర్థం! వుతకనీ. తెల్లగవుతాను."

"అవున్నిజమే! నీ జిడ్డు వదలవలసిందే మరి. కీపిటప్ మై ఫ్రెండ్, కీపిటప్"

"థాంక్యూ డియర్. యింతకీ నాకు సరిపోయే గులాబీ మొగ్గ వుందా గురూ అందులో."

"గులాబీ లేదుగానీ శిష్యా! నీకు సరిపోయే డిసెంబర్ మొగ్గ వుంది. బ్లాక్ బ్యూటీ."

ఆడపిల్లల గ్యాంగు అక్కడికి రావడంతో సంభాషణ ఆగిపోయింది.

వాళ్ళ మాటలని బట్టి తెలుగువాళ్ళని యిట్టే గ్రహించాము మేము.

"హలో మిస్! మీది హైద్రాబాదా?" — అడిగాడు షకీల్, అందులో వున్న వొకమ్మాయిని.

"అవును. బాధే. మీదీ ఆ బాదేనా?" అడిగిందా అమ్మాయి.

"ఆ... మాదీ ఆ బాధే. కాకపోతే — కాస్త హై బాధ! మేం చార్‌మినార్ దగ్గర వుంటాంలెండి"

"అదా మీ బాధ"

అందరం నవ్వుకున్నాము.

వాళ్ళు డిగ్రీ కాలేజి స్టూడెంట్లు, కాలేజి తరఫున ఎక్స్‌కర్షన్‌కి వచ్చారు.

అందరం కల్సి బొటానికల్ గార్డె

న్ఫికి బయల్దేరాము.

సాసో సాసో సాసో

మధ్యాహ్నం వరకూ నాకు ఆ అమ్మాయితో మాట్లాడే అవకాశం రాలేదు.

లంచ్ అయ్యాక ఆమె చేతులు కడుక్కోడానికి కొళాయి దగ్గిరికి వెళ్ళినప్పుడు నేనూ వెళ్ళాను వెనకే.

నన్ను చూడగానే కళ్ళతోనే నవ్వేసింది.

— ఆ నవ్వు నాలో పరిమళపు తుఫాన్ని సృష్టిస్తోంది. ఆశల్ని రేపుతోంది.

"యేమిటలా చూస్తున్నారు?" — అడిగింది.

ముందు యేమనాలో తోచలేదు. తడబడి అన్నాను —

"మిమ్మల్ని స్టడీ చేస్తున్నాను"

చిన్నగా నవ్వేసి అంది —

"ఇప్పుడుమీతో గడిపేసమయంలో మీరెంత నన్ను స్టడీ చేసినా కేవలం పుస్తక ముఖచిత్రం చూసినట్టే వుంటుంది. కాదంటారా?"

"కావొచ్చు! కాని — మంచి చిత్రకారుడెప్పుడూ పుస్తకంలోని భావాన్నంతా ముఖచిత్రంలో ప్రతిబింబింపజేస్తాడు. దీన్ని మీరు కాదనరనుకుంటాను."

"మీరు నవల్స్ చదువుతారా?"

"ఆ. చదువుతాను. కాని — పొయెట్రీ అంటే యిష్టం."

"అయితే తిలక్ మీకు తాతయ్యన్నమాట!" — నవ్వింది.

"అవును. కృష్ణశాస్త్రి నాకు మామయ్య కూడా" — నవ్వేసి అన్నాను.

"నన మాట విన్నవాళ్ళేమనుకుంటారో తెలుసా? మీకు నిజంగా వాళ్ళు దగ్గిరవాళ్ళనుకుంటారు."

"అనుకోనివ్వండి. మా తాతయ్యన్నా, మామయ్యన్నా నాకు యిష్టమే మరి."

"పదండి. నడుస్తూ మాట్లాడుకుందాము."

"ఇంతకీ మీ పేరు చెప్పనే లేదు?" అడిగాను.

"హారతి"

"ఐ లైక్ దిస్ నేమ్" వెంటనే అన్నానేను.

"థాంక్యూ!" — చెప్పింది.

సాయంత్రమయ్యేలోగా మా అందరికీ మంచి స్నేహం కుదిరింది. ఒకరి విషయాలు ఒకరికి చెప్పుకున్నాము — ముఖ్యంగా నాకు హారతి అంటే యిష్టమేర్పడింది.

తను కూడా నాతో చనువుగా ప్రవర్తించింది.

సాయంత్రమవుతుంటే చలి మొదలైంది.

కదులుతున్న మబ్బుల మధ్య నుండి వెన్నెల కురిపించడానికి ఆయత్తమవుతున్నాడు శశాంకుడు.

"ఈ సమయంలో యెవరైనా పాట పాడితే చాలా బావుంటుంది" అన్నానేను.

"మీకు తెలుసా? మా హారతి పాటలు చాలా బాగా పాడుతుంది" చెప్పిందో అమ్మాయి.

"ఒక్కపాట పాడండి ప్లీజ్" అన్నాడు షకీల్.

మేమందరం పాడమని బలవంత పెట్టేసరికి ఒప్పుకుంది హారతి.

"యేం పాట పాడమంటారో చెప్పండి?"

"చాంద్ ఫిర్ నికలా మగర్ తూ నా ఆయా ...." — చెప్పాను

ఆమె పాడటం మొదలెట్టింది.

నివ్వెరపోయాను నేను — అంత గొప్పగా పాడుతుందనుకోలేదు నేను.

మధురాతి మధురంగా పాడుతోందామె. ఆమె గొంతులోకి విరహం చీకటి కౌగిలంపై శేడియం అక్షరాలై మెరుస్తుంది.

గాలి వీచడం లేదు. లతలు కదలడం లేదు. ఆకుల గలగలల్లేవు. పూల గుసగుసల్లేవు. అన్ని శ్రవణాలు రిక్కించి వింటున్నాయి — ప్రకృతి స్తంభించిపోయింది.

ఒక మేఘ శకలం మరో 'లత' ఆవిర్భవించినట్టు తెలుసుకొని లోకానికి చాటి చెప్పడం కోసం కదిలిపోయింది.

నాకెందుకో నవీన్ సృష్టించిన 'కిరణ్మయి' పాత్ర గుర్తొచ్చింది. (అంపశయ్యలో)

మగవాడి మనస్సులో క్షణంలో రంగురంగుల లోకాన్ని సృష్టించి, అరక్షణంలో గుండెగోడల్లోకి 'మిస్సైల్స్' పంపి, ఛిన్నాభిన్నం చేసే ఆ పాత్రంటే భయం నాకు.

కాని — హారతిలో నాకేదో 'ప్రత్యేకత' కనిపిస్తుంది.

ఆ ప్రత్యేకత నా మనస్సుకి మాత్రమే తెలుస్తోంది.

దాదాపు గంటసేపు మేము తనతో పాటలు పాడించాము.

చలి యెక్కువవుతుంటే — లేచి బయల్దేరాము.

హారతి పక్కనే నడవసాగాను. నడుస్తుంటే — యెన్నెన్నో కోరికలు తలెత్తసాగాయి నాలో. రక్తనాళాల్లోకి రక్తం సెలయేరులా వడివడిగా ప్రవహించసాగింది — ఇంతకుముందు యే అమ్మాయి కూడా నాలో యింతటి సంచలనాన్ని కలిగించలేదు.

ఒక్కసారి .... ఒక్కసారి ఆమెని దగ్గిరకి తీసుకోవాలనిపించింది. ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది. ఆ చేతిని నా చేతుల్లోకి తీసుకోవాలని పిస్తుంది.

ఒకవేళ అసహ్యంగా చూస్తే!!




వుహూ! .... ఆ చూపుని తట్టుకోలేను — వొద్దు, వొద్దు.

"హైద్రాబాద్‌లో యెక్కడుంటారుమీరు?" — అడిగాను.

"యెందుకు?" — అడిగింది హారతి.

"మీ యింటికి వస్తాను."

"యెందుకొస్తారు?"

ఈ విధంగా యెదురు ప్రశ్న వేస్తుందని వూహించలేదు నేను. జవాబు యేం చెప్పాలో తోచలేదు వెంటనే.

ఆమె నవ్వింది.

అదే నవ్వు — పరిమళపు తుఫాన్ని సృష్టించే నవ్వు. గుండె లయ తప్పే నవ్వు.

"అంటే — మీ యింటికి రావద్దా?"

"రావొచ్చు. కాని — 'యెందుకు' అంటున్నాను."

"యెందుకు అంటే — యేం సమాధానం చెప్పను — వసంతంలో కోయిలెందుకు పాడుతుందంటే యేం చెప్తాం? మబ్బుని చూసి నెమలెందుకు నాట్యం చేస్తుందంటే జవాబు యేం చెబుతాం? — యిదీ అందుకే."

యేమీ సమాధానం యివ్వకుండా నిశ్శబ్దంగా వుండిపోయాను.

మళ్ళీ తనే అంది —

"ప్రతీ వ్యక్తిలోనూ అంతర్గతంగా ఒక గొప్పవ్యక్తి దాగి వుంటాడని నమ్ముతాను శమంత్‌గారూ! కాని — బలహీనతలకి లొంగి ఆ 'గొప్ప' వ్యక్తిని గుండెల్లోనే సమాధి చేస్తాం మనం. యెందుకంటే — మనిషి వర్తమానంలోనే ఆనందించడానికి అలవాటుపడ్డాడు కాబట్టి. తనకంటూ ఒక లక్ష్యమంటూ వుంటే — ఆ బలహీనతలని దాటుకుంటూ పోతాడు. మీలోనూ ఒక మంచి కవి దాగివున్నాడని నమ్ముతాను నేను. స్త్రీ ఆకర్షణ కూడా ఒక బలహీనత. దాన్ని జయించి ముందుకెళ్ళండి. మీలోని గొప్ప రచయిత కనిపిస్తాడు మాకు."

"అంటే — ఒక లక్ష్యమంటూ వున్నవాడికి స్త్రీ ఆకర్షణ వుండకూడదంటారా?"

"వుండకూడదని కాదు. వుండాలి.

కాని — అది చాలా స్వల్ప విషయంగానే తీసుకోవాలంటాను.''

వొక డిగ్రీ కాలేజి స్టూడెంటులో యింత గొప్పగా ఆలోచించే కెపాసిటీ వుంటుందనుకోలేదు నేను. నాకు తెలిసిన చాలామంది అమ్మాయిలు వేరు — ఈ అమ్మాయి వేరు.

అందంతో పాటు అందమైన ఆలోచన్లు వేయడం చాలా అరుదైన విషయం మరి.

సోసో సోసో సోసో

మేమందరం విడిపోయే సమయమొచ్చింది.

నాకెందుకో చాలా బాధవిపించింది — అందరం కల్సి సరదాగా వొకరోజు మొత్తం గడిపాము. యిప్పుడందరం విడిపోతున్నాం.

వొకరి కొకరం గుడ్‌బై చెప్పుకుంటుంటే — పోరలి వచ్చింది నా దగ్గరకి.

నా డైరీ వోపన్ చేసి, అడిగాను —

నా డైరీ అందుకొని, అందులో రాసిందిలా —

WHY DO YOU WANT
MY AUTOGRAPH
WHEN IAM IN YOUR HEART
ASA PHOTOGRAPH

కింద సైన్ చేసి, తన అడ్రెస్ రాసిచ్చి చెప్పిందిలా —

''మీరెప్పుడైనా మా యింటికి వస్తే వొక 'స్నేహితురాలిగా' మిమ్మల్ని తప్పక ఆహ్వానిస్తాను. గుడ్ బై అండ్ గుడ్ లక్'' చెప్తూ షేక్‌హ్యాండ్ ఇచ్చింది.

ఆ చేయిని అందుకున్నాను — వొక స్నేహితుడిగా. ఆ చేయి అందుకోవడంలో యింతకు ముందున్న యెక్సైట్‌మెంట్ లేదు. థ్రిల్లింగ్ అసలే లేదు. ఆప్యాయత మాత్రమే వుంది.

నాతో పాటు సతీష్ భరద్వాజ, షకీల్, జోసెఫ్ కూడా అందరికి 'గుడ్‌బై' చెప్పేసి ట్రెయిన్ యెక్కారు.

ట్రెయిన్ మెల్లిగా కదిలింది.

# చరిత్రలో మీ పుట్టినరోజు/పెళ్ళిరోజు



మా పెళ్ళి రోజు ఆగస్టు 20వ తేది. మా పెళ్ళి 20-8-81న జరిగింది. స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి జన్మదినం కూడా ఆగస్టు 20వ తేదీనే కదా! నాకు ఆగస్టు నెల అంటే చాలా ఇష్టం. ఆగస్టు 8వ తేదీన పుట్టిన రోజు. ఈ ఆగస్టు నెలలోనే 23వ తేదీ నాకు కూతురు పుట్టింది.

— ఎం. సువర్ణ,
ఎం. ఆంజనేయులు
బెంగుళూరు



మన ప్రియతమ నాయకుడు స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు మే 21. మా పెళ్ళి రోజు 21-5-1994.

కోట్లాది ప్రజల ప్రియతమ నాయకుడు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన రాజనీతిజ్ఞుడు, దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు మన మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ. ఈ మహామనీషి గురించి వ్రాయాలంటే చాలా వుంది. ఆయననే స్మరిస్తూ ఈ సందర్భాన్ని అంకితం చేస్తున్నాం.

— డి. సాయిరామ్ లక్ష్మి
పటోడియా స్పిన్నింగ్ మిల్స్,
చిట్కుల్ (పోస్ట్)
మెదక్ జిల్లా - 502 329



స్వర్గీయ ఎస్.వి. రంగారావుగారు జన్మించిన రోజు జులై 3. అదే రోజు నా పుట్టిన రోజు కావడం, నాకు ఎంతో ఆనందం కలిగిస్తుంది.

— నందే శ్రీలత,
జగ్గంపేట




ఆగస్టు 6 మా పెళ్ళి రోజు. అదే ఆగస్టు 6వ 1946లో అమెరికా యుద్ధ విమానం హిరోషిమాపై అటం బాంబు వేసింది. ప్రపంచ దేశాలన్నీ ఓ క్షణం విస్తుపోయి మరుక్షణం ఎంతో వేదన చెంది చివరకు అణ్వస్త్రాలను నిషేధించాలని తీర్మానాలు చేస్తూ సంతకాలు చేసాయి. అందుకే ఆగస్టు 6ను "హిరోషిమా డే"గా పరిగణించారు. మా పెళ్ళి రోజుని సంతోషించాలో, అంత మారణహోమం జరిగిన రోజుగా సంతాపం వెలిబుచ్చాలో తెలియని రోజది.

— బి. సురేంద్రబాబు,
బి. విజయకుమారి
ఇ.ఎస్.ఐ. హాస్పిటల్ క్వార్టర్స్
ఆదోని

దంపతులమైన మా పెళ్ళిరోజు పవిత్రమైన రోజు 5-5-62. ఆ రోజు కారల్ మార్క్స్ పుట్టారు. అదే రోజు మన కలియుగ భీమ కోడి రామమూర్తి పుట్టారు.

— మాచెర్ల
కనకదుర్గమల్లికార్జున్
హనుమాన్‌పేట



చరిత్రలో మీ పుట్టినరోజు/పెళ్ళిరోజు

గమనిక

ఈ శీర్షికలో పాల్గొనదలచినవారు ఉత్సాహవంతులైన పాఠకులు తమ జనన/వివాహ తేదీని పేర్కొంటూ ఫోటో పంపితే చాలు. ఆ తేదీకి ఇతరత్రా వున్న ప్రాధాన్యం తమకు తెలిస్తే వివరించవచ్చు. అలా వివరించని ఎంట్రీలకు తగిన అదనపు సమాచారం సంపాదకవర్గం జోడించి ప్రచురిస్తుందని గమనించమనవి.

ప్రతి ఎంట్రీతో ఫోటో విధిగా జత పరచవలసి వుంటుంది.

— ఎడిటర్